# కలిసివచ్చిన అదృష్టం!

రాంపా

''ఏవండీ పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. ఖర్చులు అంతకంతవున్నాయి. మీ సంపాదన మీ సిగరెట్లకు, బండి పెట్రోలుకే అయిపోయేట్టుంది. ఏదో ఒకటి చేయాలి'' కొద్దిగా ఈసడింపును జోడించి అన్నది నా సహచరి.

అప్పుడే వెలిగించిన సిగరెట్‌ని నలిపి పడేశాను. ''గొప్ప త్యాగం చేశారులెండి' అన్నట్లుగా మూతి విరిచింది గాని ఏం మాట్లాడలేదు. మామూలుగా ప్రతిదానికీ ఏదో ఒకటి అనే నోరు ఎందుకు మెదలలేదా అని కొద్ది సేపు మౌనంగా వుండి ''సరే ఎప్పటినుంచో పెడదాం పెడదాం అంటున్నావుగా వర్కింగ్ వుమెన్స్ హాస్టల్. యిప్పుడే వెళ్లి పేపర్ యాడ్ యిచ్చొస్తా'' అన్నాను.

వెంటనే ఎక్కడలేని ఆనందంతో కాఫీ చేసి యిచ్చింది.


***

'వనితాలయ – మీ యింట్లో వున్నట్లే మా యింట్లో వుండొచ్చు. మీ యింట్లో తిన్నట్లే మా యింట్లో తినొచ్చు.' అనే స్లోగన్‌తో పేపర్లో ప్రకటన చూసి ఎగిరి గంతేసింది.

ఎంక్వయిరీల కోసం ఫోను దగ్గరే కూచున్నాం. చుట్టాల దగ్గర నించి ఫోన్లొస్తే నిర్మొహమాటంగా కట్ చేస్తున్నాం.

ఫోన్ రింగయింది. అది చుట్టాల ఫోన్ కాదు. ఖచ్చితంగా ఎంక్వయిరీ ఫోనే అనీ, అది మొదటి ఫోననీ – తను కొబ్బరికాయ కొడితే – నేను ఫోనెత్తా.

''ఏమండీ. యివ్వాళ పేపర్లో మీ ప్రకటన చూశాను. నేను డాక్టరు



వనితా వినోదినిని. గైనకాలజిస్టునండీ. ఏ లేడీసైనా, లేడీస్ కంప్లయింటేదైనా నా దగ్గరికే వస్తారు. నేను చాలా వర్కింగ్ వుమెన్స్ హాస్టల్స్‌కి కన్సల్టెంట్‌గా వున్నాను. మీరు నన్ను తప్పకుండా సంప్రదిస్తారు కదూ'' యింకా ఏదో చెప్పబోతుంటే విషయం అర్థమయింది కాబట్టి అనవసరంగా ఫోన్ ఎంగేజ్‌లో పెడితే రియల్ కాల్స్ మిస్సవుతాయని వెంటనే ఫోన్ పెట్టేశాము.

ఫోన్ల మీద ఫోన్లు వస్తాయనుకున్న మమ్మల్ని నిరాశపరుస్తూ గంటదాకా ఏ ఫోనూ మోగలేదు. మరీ దాని పక్కనే వుండడమెందుకని నేను బాల్కనీలోకి వెళ్లి ఒక సిగరెట్ కాల్చి బూడిద చేస్తున్నా.

పక్కింట్లో కాలింగ్ బెల్ మోగితే మా ఫోనే అనుకుని వంటింట్లోంచి తను...బాల్కనీ లోంచి నేను ఫోను దగ్గరకొచ్చి దిగులుగా నవ్వుకున్నాం.

కొద్దిసేపటికి రింగయింది. తన చేయిమహిమను చూస్తానని ఈ సారి ఫోను తను ఎత్తింది. ఎవరో అమ్మాయి యింగ్లీషులో మాట్లాడుతున్నది అని నాకిచ్చింది. అది కొత్తగా పెట్టిన ఓ కంపెనీ వాళ్ల నించి. ''ఏమండీ మేం కొత్తగా ఆఫీసు పెట్టాం. మీకు తెలుసు. ఈ రోజుల్లో రిసెప్షనిస్టుగా అమ్మాయి వుంటే బావుంటుంది. మీ హాస్టల్లో ఆ యింట్రెస్టు వున్న అమ్మాయి వుంటే మాక్కాస్త చెప్పరూ'' అన్నది ఆ ఫోన్ భావం.

యిక మాకు దిగులు పోయి నవ్వు మొదలైంది. మళ్లీ రింగయింది.

ఈసారీ తనే మాట్లాడింది.

''ఏమండీ మా అమ్మాయికి యింజనీరింగులో సీటు వచ్చింది. అయితే ఆ కాలేజీ మెహదీపట్నంలో వుంది. మీరు వర్కింగు వుమెన్స్ హాస్టలు వారేగా – ఆ దగ్గర్లో ఏదన్నా హాస్టలు వుంటే కాస్త చెబుదురూ'' అంటే ''మావారు అటువేపు ఏమన్నా వెళ్తే కనుక్కుని చెబుతారులెండి'' అని వాళ్ల సెల్ నెంబరు నోట్ చేసుకుంది తను. యిందులో సమాజసేవ కూడానా అని నవ్వుకున్నాం. ఆదివారం కాబట్టి టీవీ వదిలేట్లు లేరు పిల్లలు. ఎక్కడ రింగు వినబడదో అని సౌండ్ తగ్గించమని పిల్లలకి చెప్పాం.

ఫోను మోగింది.

''ఏమండీ 'నేటి వనితలూ ఆధునిక ధోరణులు' అనే అంశం మీద కొన్ని హాస్టల్స్‌లో వనితల్ని మేం యింటర్వ్యూ చేస్తున్నాం. కాస్త మీ అడ్రసు చెబుతారా'' అని ఓ టీవీ ఛానెల్ వాళ్లడిగారు.

'లేదండీ మేం కొత్తగా హాస్టల్ పెడదామని యాడ్ యిచ్చామండీ'' ...యింకా ఎవరూ చేరలేదని నెగటివ్‌గా చెప్పదలచుకోలేదు.

''అయితే ఎవరూ లేరాండీ'' అని అడిగారు.

''తప్పకుండా వస్తారనే ఎదురు చూస్తున్నాం'' అన్నాను.

''అయితే సారీ'' అని ఫోన్ పెట్టేశారు. ఈ విషయం మా ఆవిడకి చెబ్తే...

''ఎవరన్నా వచ్చే వాళ్లుంటే చెప్పమని వాళ్లకి చెప్పొచ్చుగా'' అంది.

''మన గురించి వాళ్లెందుకు శ్రమపడతారు చెప్పు'' అన్నాను.

ఈ పని మనం ఎప్పుడో చేసుంటే ఈపాటికి మన హాస్టల్లో అమ్మాయిలుండేవాళ్లు. మనింటికిక టీవీవాళ్లు వచ్చేవాళ్లు. అని నవ్వుకున్నాం. వెయిటింగ్ అంటే చాలు అదెందుకో నిద్ర ముంచుకొస్తుంది ఎక్కడైనా.

యిద్దరమూ ఆవులించాము.

నాన్నా ఫోనంటూ మా బాబు లేపాడు. టైం చూస్తే సాయంత్రం నాలుగైంది.

''ఏవండీ – మీ హాస్టల్ యాడ్ తెలుగు పేపర్లో యిచ్చారు. మాది ఎక్కువ సర్కులేషన్ వున్న యింగ్లీషు పేపరు. మా పేపర్లో యిస్తే చాలా తక్కువ''

ఏదో జవాబు చెప్పి కునుకు తీస్తుంటే మా ఆవిడ నిద్రలో నవ్వు వినిపించింది.

రాత్రి తొమ్మిది గంటలకు మళ్లీ ఫోను మోగింది.

''ఏమండీ. నేను మా వారికి పాలకు నీళ్లలా సహాయపడదామనుకుంటున్నాను. నాకొచ్చినపని కూరగాయలు తరిగి కూరలు చేయడం బియ్యంలో రాళ్లు ఏరి అన్నం వండడం. నెలకు వెయ్యిస్తే చాలు ఎంతమందికైనా వండి వడ్డిస్తాను.'' ఆ ఫోను మా ఆవిడకిచ్చాను.

ఆవిడ ఏదో జవాబు చెప్పింది.

కనీసం ఆరుగురినుంచన్నా రెస్పాన్సు వస్తే మా పక్కనే డబుల్ బెడ్ రూమ్ పోర్షన్ ఖాళీగా వుంది. అది తీసుకోవచ్చనుకున్న మాకు ఆ రోజు అలా గడిచిపోయింది.

మర్నాడు పొద్దునే ఫోను!

''ఏమే- కంగ్రాచ్యులేషన్స్. నాకు చెప్పకుండానే హాస్టల్ పెడదామనుకున్నారన్నమాట. యాడ్ లో మీ నెంబరు, ప్లేస్ చూసి ఆనందమేసింది. ఈ రోజుల్లో వుమెన్స్ హాస్టల్ మంచి అయిడియా బెస్ట్ ఆఫ్ లక్.'' అని మా వదినగారు ఫోన్ చేసింది. మా ఆవిడ వాళ్లక్కయ్యకు నిన్న ప్రహసనం అంతా చెప్పి నవ్వుకుంది.

ఆ తర్వాత ఎప్పుడో వారం రోజులకు ఫోను వచ్చింది.

''ఏమండీ మేం కొత్త నటీనటులతో సినిమా తీస్తున్నాం. మా హీరోయిన్‌కి స్నేహితురాళ్లుగా అందమైన అమ్మాయిలు కావాలి'' అని.

సంగతి మా స్నేహితుడికి చెప్పా. వాడు నవ్వి. 'తిరుపతిలో దువ్వెన్ల వ్యాపారం అన్నట్లుగా వుందిరా' అని ఏవో ఉదాహరణలు చెప్పి –

''మీ యిల్లు ఏ అమీర్‌పేట బస్టాండుకో, పంజాగుట్ట చౌరస్తా దగ్గరుంటే ఈ కాన్సెప్ట్ క్లిక్ అవుతుందని సలహా యిచ్చాడు. అందులో నిజం వుంది. అయితే యిల్లు ఖాళీ చేయడం, ప్యాకర్స్ అండ్ మూవర్స్ ఖర్చు, రెండునెల్ల అద్దె అడ్వాన్సు, బ్రోకర్ కమీషన్లు గుర్తొచ్చి ఆ సంగతి వెంటనే మా ఆవిడకి చెప్పలేదు.

**''అదృష్టం సరిగా లేని వాడు అగ్గిపెట్టె వెతికితే వెంటనే దొరకలేదట. అతి కష్టం మీద సాధిస్తే అది ఖాళీగా వుందట. మూత జారిపోకుండా అందులో ఓ పుల్ల కనిపించింది చాలు అనుకుంటే దానికి హెడ్ లేదట''-**

***

వర్కింగు వుమెన్సు హాస్టలు పెట్టాలన్న మా కోరిక తీరడానికి రెండేళ్లు పట్టింది. సిటీలో అన్ని రూట్లకు కన్వేయన్స్, కన్వీనియన్స్ వున్న బస్టాండుకు దగ్గర్లో త్రీ బెడ్ రూమ్ యిండిపెండెంట్ యిల్లు అద్దెకు దొరికింది. నీళ్ల యిబ్బంది లేదు. విశేషం ఏంటంటే అంతకు ముందు ఆ యింట్లో వర్కింగు వుమెన్సు హాస్టలు బాగా నడిచి – వాళ్లు పెద్ద ఎత్తున యిరవై గదుల పోర్షన్ తీసుకున్నారు. మా యింటి ముందు కిండర్ గార్డెన్ స్కూలు. సాయంత్రం నాలుగ్గంటల కల్లా స్కూలు అయిపోయి ప్రశాంతంగా వుంది. యిరవై ఏళ్ల మా నగర జీవితంలో బయట మంచాలు వేసుకుని పడుకునే అదృష్టం యిక్కడే పట్టింది. పద్నాలుగు వేలు అడ్వాన్సు యిచ్చాం. పదివేలు పెట్టి మంచాలు, పరుపులు చేయించాం. అంతా అక్కడక్కడా అప్పు చేసా – అంతా సెటిల్ అయి అమ్మాయిలు వచ్చే వేళకి....ఆ స్కూలు ఎత్తేసి బాయిస్ హాస్టల్ పెట్టారని తెలిసింది. యిటు పక్కింట్లో ఎనిమిదేళ్ల నించి వుంటున్న టెనెంట్సు ఖాళీ చేసి వెళ్తే ఆ యింటాయన ఆ యింటిని బాగుచేయించి బ్యాచలర్స్‌కి కిరాయికిచ్చాడు. పరిస్థితికి ఏడవలేక నవ్వుకున్నాం. వర్కింగ్ వుమెన్స్ హాస్టల్ విత్ మేట్రిమోనియల్ కన్సల్‌టెన్సీ అని పబ్లిసిటీ యిద్దాం అని జోకులేసుకున్నాం.

అమ్మాయిలొస్తున్నారు! ''అమ్మో కాంపౌండ్ వాలంతా బాయిసే వున్నారు.'' అంటూ బెదిరిపోతున్నారు!

''అదృష్టం సరిగా లేనివాడు అగ్గిపెట్టె వెతికితే వెంటనే దొరకలేదట. అతి కష్టం మీద సాధిస్తే అది ఖాళీగా వుందట. మూత జారిపోకుండా అందులో ఓ పుల్ల కనిపించింది చాలు అనుకుంటే దానికి హెడ్ లేదట''– అని మా ఆవిడకి చెబితే

''అందుకే సిగరెట్ మానేయండి. అగ్గిపెట్టె ఉదాహరణ మీరూనూ'' అంటూ మూతి విరిచింది మా ఆవిడ.

సిగరెట్ అంటే విరక్తి కలిగింది. ఆ విరక్తి చాలా మందికి కలగాలని ''సిగరెట్ తాగడం ఆత్మహత్య. సిగరెట్లు అమ్మడం హత్య'' అని పోస్టర్ రాసి సిగరెట్టు కొట్టుకి అంటించా.

ఆ కొట్టువాడు దాన్ని ఎంత పీకినా రాకపోయేసరికి వాడు నా కోసం గాలిస్తున్నాడని తెలిసింది. దయచేసి వాడికి నా అడ్రసు చెప్పకండి.

★